క్లుప్తంగా

చకచకా బొమ్మలు వేసేద్దాం..



తాము వేసిన చిత్రాలతో విద్యార్థులు

పెందుర్తి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. సమరసత ఫౌండేషన్ కన్వీనర్ మూర్తి 'పదాలతో'లయబద్ధంగా చప్పట్లు కొట్టడం నేర్పించారు. చిన్నారులకు చిత్రలేఖనంపై తర్ఫీదునిచ్చారు. అనంతరం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పి.భూలోకరావు, ఆడారి రామకృష్ణ, పెంటకోట గణేష్, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు

పెందుర్తి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిల్ల పైడిరాజు అన్నారు. సుజాతనగర్ సమీపంలోని బర్ధన్‌నగర్‌లో సీపీఐ ఏరియా సమితి 2వ మహాసభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ పెందుర్తి ప్రాంత ప్రజలకు సీపీఐ అంటే ఎంతో అభిమానం ఉందన్నారు. గతంలో ఈ ప్రాంతం నుంచి సీపీఐ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందిన మానం ఆంజనేయులు నిరుపేదలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం కార్పొరేట్‌లకు మాత్రమే కొమ్ముకాస్తున్నాయని, నిరుపేదలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. అనంతరం పెందుర్తి ఏరియా సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రెంటికోట శ్రీనివాస్, సభ్యులుగా ఎర్రిపిల్లి రాంబాబు, నేతింటి అసిరినాయుడు, మొగులు రాము, అంపవల్లి అన్నపూర్ణ, కక్కల రజని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వృద్ధునికి ఆశ్రయం కల్పించిన పోలీసులు



రాంగోపాల్‌ను లయోలా వృద్ధాశ్రమానికి అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: ఒంటరిగా జీవనం సాగిస్తున్న ఓ వృద్ధునికి పెందుర్తి పోలీసులు స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. గాజువాక ప్రాంతానికి చెందిన చామర్తి రాంగోపాల్ (70) ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేసి పదవీ విరమణ పొందాడు. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో జీవనం ఇబ్బందికరంగా మారడంతో పినగాడికి చెందిన తన పూర్వ సహోద్యోగి సహకారం కోరాడు. అతనికి కుటుంబ బాధ్యతలు ఉండడంతో రాంగోపాల్‌కు ఎక్కడైనా ఆశ్రయం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేశాడు. స్పందించిన సీఐ కె.వి.సతీష్‌కుమార్ వెంటనే స్థానిక లయోలా వృద్ధాశ్రమ నిర్వాహకుడు దొడ్డి ప్రకాష్‌తో మాట్లాడి రాంగోపాల్‌ను ఆశ్రమంలో చేర్పించారు.

సాయి బాటలో బాలలు నడవాలి



డాక్టర్ భారతిని సత్కరిస్తున్న అగనంపూడి సత్యసాయి భజన మండలి ప్రతినిధులు

అగనంపూడి: బాల్యం నుంచే సత్యసాయి బాబా బాటలో పయనించి నైతిక, ఆధ్యాత్మిక విలువలతో జీవించాలని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. సత్యసాయి భజన మండలి అగనంపూడి సారథ్యంలో మాతృమూర్తి ఈశ్వరమ్మ జయంతి వారోత్సవాల్లో పాల్గొని బాల వికాస్ చిన్నారులనుద్దేశించి ఆమె మాట్లాడారు. సత్యసాయి సూచించిన మార్గంలో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు సత్యసాయి భజన మండలి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రేమ, సేవ, ఆధ్యాత్మికతే జీవిత పరమార్థంగా చేసుకుని మానవుడు తన జీవన ప్రయాణాన్ని సాగించాలని సత్యసాయి ప్రపంచానికి చాటి చెప్పారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందుతున్న డాక్టర్ భారతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిన్నారులు పలు కార్యక్రమాలు ప్రదర్శించారు. నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, సత్యసాయి భజన మండలి కన్వీనర్ విందుల పైడినాయుడు, ఆధ్యాత్మిక విభాగం కోఆర్డినేటర్ విందుల రామారావు, రమాదేవి, ఓలేటి సాయి సరస్వతి, పద్మలత, బి.వి.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

జాడ లేని.. నిఘా నేత్రం!

ప్రస్తుత సాంకేతిక యుగంలో ఏ నేరం జరిగినా సీసీ టీవీ ఫుటేజ్ కీలకం. దీంతో గంటల వ్యవధిలోనే నేరస్తులు పోలీసులకు చిక్కుతున్నారు. మరోవైపు నేరాలు చేసేందుకు వెనుకాడే పరిస్థితి. అయితే పారిశ్రామికంగా ప్రగతి పథంలో దూసుకెళ్తున్న పరవాడ మండలంలో మాత్రం లంకెలపాలెం, ఊటగెడ్డ, సినిమాహాలు, మండల కాంప్లెక్సు కూడళ్లు తదితర ఒకటీ అరా చోట్ల మినహా మరెక్కడా సీసీ కెమెరాల జాడ కనిపించదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి ఘటనలు జరిగినా నేరస్తులను గుర్తించడం పరవాడ పోలీసులకు సవాల్‌గా మారుతోంది.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన సంతబయలు ప్రదేశం

- పరవాడ మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై నిర్లక్ష్యం
- తరచూ నేరాలు జరుగుతున్నా.. పట్టించుకోని యంత్రాంగం
- ఒకటీ అరా చోట్ల మినహా.. మరెక్కడా కానరాని సీసీ కెమెరాలు



పరవాడ సంతబయలులో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిబూడిదైన పాన్‌షాపు(ఫైల్)



పరవాడ సంతబయలులో జరిగిన చోరీపై వివరాలు సేకరిస్తున్న పరవాడ పోలీసులు(ఫైల్)

పరవాడ: అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న పరవాడ మండలంలో నేరాల సంఖ్య కూడా రానురానూ పెరుగుతోంది. నేర నియంత్రణ, నిందితులను పట్టుకోవడంలో కీలకమైన సీసీ కెమెరాల వ్యవస్థ మాత్రం కనీస స్థాయిలో కూడా లేదు. 15 గ్రామ పంచాయతీలతో విస్తరించిన పరవాడ మండల పరిధిలో సింహాద్రి ఎన్టీపీసీ, 95 ఔషధ పరిశ్రమలతో కూడిన విశాఖ ఫార్మాసిటీ, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు ప్రధానమైనవి. ఎక్కడ ఏ నేరం జరిగినా.. ముందుగా సమీపంలోని ప్రైవేట్ వ్యక్తుల సీసీ ఫుటేజీలు అందుబాటులో ఉంటే వాటిపైనే ఆధారపడే పోలీస్ యంత్రాంగం, తమ పరిధిలోని ప్రధాన కూడళ్లలోవాటి ఏర్పాటుపై దృష్టి సారించకపోవడం శోచనీయం.

నిఘా తప్పనిసరి ప్రాంతాలివే..

మండలంలోని కొన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి. ఫార్మా పరిశ్రమలకు రాకపోకలు సాగించే తానాం, రాంకీ కూడళ్లు, పరవాడ సంతబయలు, సబ్‌స్టేషన్ కూడలి, జేఎన్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో గృహ సముదాయాలు, దేశపాత్రునిపాలెం కూడలి, వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, భర్ణికం, ధర్మారాయుడుపేట కూడళ్లలో సీసీ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తే చాలా వరకు నేరాలను నియంత్రించవచ్చు.

ఇటీవలి సంఘటనల్లో కొన్ని..

- గాజువాక–యలమంచిలి రహదారిలో ధర్మారాయుడుపేట కూడలి వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నెల 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో అచ్యుతాపురం మండలం చోడపల్లికి చెందిన ఏడేళ్ల చిన్నారి లిఖిత ప్రాణాలు కోల్పోయింది. బాధ్యులెవరన్నది తెలియని పరిస్థితి.
- ఆదే రోజు రాత్రి 2 గంటల సమయంలో పరవాడ సంతబయలు ప్రాంతంలో తేలు అప్పలరాజుకు చెందిన పాన్‌షాపును గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. భారీగా ఆస్తినష్టం వాటిల్లినా.. నిందితుల్ని గుర్తించలేకపోయారు.
- గతేడాది సంతబయలు ప్రాంతంలోని శ్రీ లక్ష్మీసాయి ఎరువుల దుకాణం, తేలు చలపతిరావులకు చెందిన దుకాణాల్లో అగ్నిప్రమాద ఘటనలు నేటికీ అనుమానాస్పదంగానే మిగిలిపోయాయి.
- పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న జేఎన్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో గృహ సముదాయాల్లో తరచూ జరుగుతున్న చోరీ కేసుల ఛేదన పోలీసులకు సాధ్యం కాక, తలనొప్పిగా మారుతున్నాయి.

తీవ్రంగా నష్టపోయాను



పరవాడ సంతబయలు వద్ద ఏర్పాటు చేసుకున్న నా పాన్‌షాపునకు గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 1న నిప్పంటించారు. విలువైన వస్తు సామగ్రి కాలిపోయి తీవ్రంగా నష్టపోయాను. సంతబయలు ప్రాంతంలో తరచూ అగ్ని ప్రమాదాలు, దొంగతనాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టడానికి ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. పోలీస్ గస్తీ కూడా నిరంతరం ఉండాలి.

– తేలు అప్పలరాజు, పరవాడ

తీర ప్రాంతాల్లో భద్రత ఏదీ



ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల భద్రత కోసం ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను అమర్చాలి. ఇక్కడికి వాహనాలపై రాకపోకలు సాగించే అపరిచిత వ్యక్తులపై నిఘాను మరింత పెంచాలి. గ్రామ ప్రజల భద్రతపై పోలీసులు దృష్టి సారించాలి. తీర ప్రాంత గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు అడపాదడపా చోరీలకు పాల్పడుతున్నారు. పోలీస్ పికెటింగ్‌తో నిఘా పెట్టాలి.

– కొర్లయ్య, మత్స్యకార్మికుడు, ముత్యాలమ్మపాలెం

దొంగతనాలు పెరిగిపోయాయి



గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో గృహ సముదాయాల్లో దొంగతనాలు పెరిగిపోయాయి. అపరిచితులు కాలనీల్లో ఇళ్లను అద్దెలకు తీసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అపరచితులను గుర్తించడం స్థానికులకు సాధ్యం కావట్లేదు. కాలనీల్లో గంజాయి బ్యాచ్‌లు అధికమయ్యాయి. కాలనీలకు నాలుగు వైపుల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

– పి.వెంకటరామ నరసింహం, జేఎన్ఎన్‌ఎంయూఆర్ఎం కాలనీ

స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు సహకరించాలి



పరవాడ ప్రాంతంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి. పరిశ్రమలు తమ సీఎస్సార్ నిధులను ఇందుకు వెచ్చించాలి. గ్రామీణ ప్రాంతాల్లోని వాణిజ్య సముదాయాలు, గృహ సముదాయాల వద్ద సొంతంగా సీసీ కెమెరాలను అమర్చుకోవాలి. చోరీలు, అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

– ఆర్.మల్లికార్జునరావు, సీఐ, పరవాడ

వెలుగు వీవోఏల సమ్మె నోటీసు



వెలుగు ఏపీఎంకు సమ్మె నోటీసు అందిస్తున్న సిటు నాయకులు

పరవాడ: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సిటు ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయం వద్ద వెలుగు వీవోఏల యూనియన్ ప్రతినిధులతో కలిసి వెలుగు ఏపీఎం రంగారావుకు మంగళవారం సమ్మె నోటీసు అందించారు. అనంతరం వెలుగు వీవోఏల సంఘ అధ్యక్షురాలు పైడి లక్ష్మి మాట్లాడుతూ వీవోఏల కాల పరిమితిని రద్దు చేయాలని, కనీస వేతన చట్టం అమలు చేసి, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరా టాల ద్వారా సాధించిన కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పులు చేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్ కింద మార్చి వాటి అమలుకు ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. దీన్ని నిరసిస్తూ దేశంలోని అన్ని కార్మిక, రైతు సంఘాలు మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రమాదేవి, ఉమ, వెంకటలక్ష్మి, విజయ, వరలక్ష్మి, నీలిమ, మణి పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పెదగంట్యాడ: వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. స్థానిక శాఖా గ్రంథాలయంలో రోజూ పదుల సంఖ్యలో విద్యార్థులు పాల్గొని, కొత్త కొత్త అంశాలను నేర్చుకుంటున్నారు. శిక్షణలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో మంగళవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో చిత్రలేఖనంపై ఉన్న ఆసక్తిని గుర్తించి వారికి మెలకువలు నేర్పినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. వాటిలో నీతిని పిల్లలతోనే చెప్పించారు. అనంతరం విద్యార్థులకు కలర్స్, పేపర్స్ అందజేసి వారితో అందమైన చిత్రాలు గీయించారు. ఉత్తమ చిత్రాలు వేసిన వారిని అభినందించారు.

వేంకటాద్రిపై ఘనంగా ధ్వజారోహణ





పూజలందుకున్న వెంకటేశ్వరస్వామి,

బ్రహ్మోత్సవాల రెండో రోజు వెంకన్నకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ధ్వజారోహణ, హోమాలు జరిపారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు గురువారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం కనుల పండువగా సాగనుంది. వేంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై విహరిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధికి భక్తులకు కనువిందు చేయనున్నారు. ఆఖరి రోజు శుక్రవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. రెండోరోజు పూజల్లో ఈవో నీలిమ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తుక్కు దుకాణంలో అగ్నిప్రమాదం



తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం వలన ఎగసిపడుతున్న మంటలు, దట్టమైన పొగ



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పరవాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని ఓ తుక్కు దుకాణంలో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో తుక్కు దుకాణంలోని ప్లాస్టిక్ డబ్బాలు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. దుకాణం పైనుంచి ఏర్పాటు చేసిన హైటెన్షన్ విద్యుత్ తీగల నుంచి రాలిపడిన నిప్పు రవ్వలే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు..

మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో తుక్కు దుకాణంలో దట్టమైన పొగలతో కూడిన మంటలు ఎగసిపడ్డాయి. దుకాణంలో నిల్వ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, ప్యాకింగ్ సామగ్రి, రసాయన డబ్బాలకు మంటలు వ్యాపించడంతో పొగ, మంటలు మరింత పెరిగాయి. పరిసర గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అగ్నిప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఘటనా స్థలికి చేరుకుని మంటల నియంత్రణకు అవసరమైన చర్యలను చేపట్టారు. అనకాపల్లి, రాంకీ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంతో యజమానికి తీవ్ర నష్టం సంభవించింది. ఈ తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించడం ఇది రెండో సారి. తుక్కు దుకాణాల్లో తరచూ అగ్ని ప్రమాదాల వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు ఏర్పడుతోందని, ప్రమాద కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదం సంభవించిన తుక్కు దుకాణానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఇటీవల ఇక్కడ ఓ తుక్కు దుకాణంలో రసాయన వ్యర్థాలు తుళ్లి ఓ కార్మికుడు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. పరవాడలో అనుమతులు లేని తుక్కు దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైభవంగా దుర్గాలమ్మ పండగ



పసుపు కుంకుమలు తీసుకొస్తున్న మహిళలు



దుర్గాలమ్మ సన్నిధిలో గండి రవికుమార్

సబ్బవరం: స్థానిక ప్రజల ఇలవేల్పు దుర్గాలమ్మ పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి సబ్బవరంతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. పెద్ద ఎత్తున మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అనుపు మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన శక్తి వేషాల నేల డ్యాన్స్‌లు, కోలాటం ఆకట్టుకున్నాయి.

దుర్గాలమ్మ పండగ మహోత్సవం సందర్భంగా అమ్మవారిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు మోసం

- అకాల వర్షాలతో వరి పంటకు తీవ్ర నష్టం
- పరిహారం దక్కేలా కలెక్టర్‌కు నివేదిస్తాం
- నియోజకవర్గ సమన్వయకర్త అదీప్‌రాజ్



పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్



పైడివాడలో అకాల వర్షంతో నష్టపోయిన వరి పంటను పరిశీలిస్తున్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా పక్కన పెట్టిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో రైతన్నలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ హామీల్లో అన్నదాత సుఖీభవ పథకం పేరిట రైతులకిస్తామన్న పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. రైతు భరోసా, పంటల బీమా, రైతులకు ఉచిత విద్యుత్ అందించామన్నారు. గత ప్రభుత్వంలో వరి కనీస మద్దతు ధర 75 కిలోల బస్తా రూ.1,725 ఉండగా ప్రస్తుతం రూ.1300 లోపే ఉందన్నారు. తడిచిన ధాన్యాన్ని ఆరోజు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసే పరిస్థితి ఉండేదన్నారు. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పలు ప్రాంతాల్లో వ్యవసాయం దెబ్బతిందన్నారు.

పైడివాడలోని సేనాపతి అప్పారావు పంట పొలాన్ని పరిశీలించామన్నారు. ఎకరం పొలంలో వరి వేస్తే, పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో తడిసి తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. పంట నష్టం అంచనా వేసే పరిస్థితి స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు లేదని ఆక్షేపించారు. పంట నష్టాన్ని అంచనా వేసి, గరిష్టంగా పరిహారం దక్కేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పార్టీ అధికార ప్రతినిధి కొటాన రాము, జిల్లా యువజన విభాగం మాజీ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, రైతు విభాగం అధ్యక్షుడు వద్దాది అప్పలరాజు, సబ్బవరం మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, వార్డ్ ఇన్‌చార్జ్ మెంటి మహేష్, పార్టీ సీనియర్ నాయకుడు బలిరెడ్డి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతగా నిలిచిన జట్టుతో వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరిపాలన భవన కార్యాలయాల సిబ్బంది మధ్య నిర్వహించిన క్రికెట్ పోటీల్లో నియాన్ గ్రీన్ కలర్స్ జట్టు విజయం సాధించింది. బ్లూ బ్లాస్టర్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. మంగళవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ విజేతలకు, రన్నర్‌లకు బహుమతులు అందజేశారు. గ్రీన్ థండర్స్ మేనేజర్ డా.పి.వి.ఎస్.ఎన్.వి.సాంబమూర్తి, కెప్టెన్ పి.రాజేంద్ర ప్రసాద్, బ్లూ బ్లాస్టర్స్ మేనేజర్ ఆర్.శ్రీనివాస్, కెప్టెన్ కె.సంతోష్ కుమార్ , ఇతర క్రీడాకారులను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎస్ ధనంజయరావు పాల్గొన్నారు.

ఎండిన చెట్లతో పొంచివున్న ప్రమాదం



ఎన్టీపీసీ రహదారిలో మోడువారి కూల డానికి సిద్ధంగా ఉన్న చెట్లు



ఎండిపోయి ప్రమాదకర స్థితిలో ఉన్న వృక్షం

పరవాడ: వాడచీపురుపల్లి–పరవాడ రహదారిలో ఎండిన చెట్లు ఏ క్షణంలో కూలుతాయోనని ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. కొన్నేళ్ల క్రితం సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం వాడచీపురుపల్లి నుంచి ఊటగెడ్డ కూడలి వరకు రోడ్డు పక్కన చెట్లను నాటింది. ఆ తరువాత వాటి ఆలనాపాలనా చూసే నాథుడు లేక వాటిలో కొన్ని చెట్లు ఎండిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోలేదు. ఎన్టీపీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు, అనేక గ్రామాల ప్రజలు ఈ రహదారి మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అప్పుడప్పుడు ఎండిన చెట్ల నుంచి కొమ్మలు విరిగి పడుతున్నాయి. పూర్తిగా ఎండిపోయిన చెట్లు ఏ క్షణంలోనైనా నేలకూలి ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రయాణికులు చెట్ల పక్క నుంచి రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి ఎండిన చెట్లను తొలగించేందుకు ఎన్టీపీసీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అపార్ట్‌మెంట్లకు సీసీ కెమెరాలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పెందుర్తి క్రైం విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ డి.సూరిబాబు అన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌లోనూ తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్ ఏ–జోన్ పార్కులో ప్రజలకు నేరాలపై మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వేసవిలో చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెలవులకు ఊరు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎల్‌హెచ్‌ఎంఎస్ సాంకేతిక నైపుణ్యం కలిగిన కెమెరాల ఏర్పాటుతో పాటు రాత్రి సమయంలో గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. మోటార్ సైకిళ్ల చోరీలు ఎక్కువగా ఉన్నందున ద్విచక్ర వాహనాలను సురక్షిత ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. పండగల వేళ మహిళలు ఆభరణాలు వేసుకుంటే చున్నీలు, చీర కొంగులు కప్పుకుని ప్రయాణాలు చేయాలని సూచించారు.